# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు " వీర బాల దివస్" కార్యక్రమంలో పాల్గొంటారు.
2. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ఆర్థిక సాయం చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు.
3. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో తెలుగు చలన చిత్ర ప్రముఖులు ఈరోజు సమావేశమవుతారు.
4. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు.
5. తెలంగాణ ప్రభుత్వం కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానాన్ని ప్రవేశపెట్టనుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు " వీర బాల దివస్" కార్యక్రమంలో పాల్గొంటారు. ఢిల్లీలోని భారత్ మండపంలో ఈరోజు మధ్యాహ్నం జరిగే ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తారు. కాగా సిక్కుల పదవ గురువైన గురుగోవింద్ సింగ్ ఇద్దరు చిన్న కుమారులైన బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగల్ ధైర్య, సాహసాలను, త్యాగాలను స్మరించుకుంటూ.. ప్రతి ఏటా డిసెంబర్ 26న 'వీర బాల్ దివస్' కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

ఇది ఇలా ఉండగా.. పోషకాహార సంబంధిత సేవల అమలును విస్తృతం చేసేందుకు ఉద్దేశించిన 'సుపోషిత్ గ్రామ పంచాయితీ అభియాన్'ను ప్రధానమంత్రి ఈ రోజు ప్రారంభిస్తారు.

--------------------------

భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనుందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. తెలంగాణాలోని మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రకృతి సేంద్రియ రైతు సమ్మేళనంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ, దేశ ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ రంగానిది కీలకపాత్ర అని అన్నారు. రైతుల ఆర్థిక ప్రగతే దేశ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిగా పనిచేస్తుందని పేర్కొంటూ,

వాయిస్ ( 36 సెకన్లు )

-------------------------

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ఆర్థిక సాయం చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తిచేశారు. ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి గత సాయంత్రం ప్రధానమంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ఇటీవల ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర విజన్ – 2047ను ప్రధానమంత్రికి అందించి, దాని సాకారానికి కేంద్రం తరపున అన్నిరకాలుగా సాయం అందించాలని కోరారు. అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌లతో వేర్వేరుగా సమావేశమై రానున్న బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తగిన సాయం అందేలా చూడాలని కోరారు. అలాగే కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

-------------------------

ఎన్డీయే పక్షాలు మరింత సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించాయని నరసరావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు జేపీ నడ్డా నివాసంలో జరిగిన ఎన్డీయే పక్షాల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆయన పాల్గొన్నారు. సమావేశం అనంతరం శ్రీకృష్ణ దేవరాయలు పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ ( 22 సెకన్లు )

-------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో తెలుగు చలన చిత్ర ప్రముఖులు ఈరోజు సమావేశమవుతారు. ఈ ఉదయం 10 గంటలకు చలనచిత్ర అభివృద్ధి మండలి చైర్మన్ దిల్ రాజ్ ఆధ్వర్యంలో చిత్ర ప్రముఖులు ముఖ్యమంత్రిని కలవనున్నారు. ఇందులో భాగంగా పరిశ్రమలోని సమస్యల గురించి చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని దిల్ రాజు తెలిపారు. ఈ సమావేశంలో తాజా పరిణామాలపై చర్చించనున్నట్లు చెప్పారు. కాగా సంధ్య థియేటర్ ఘటన అనంతరం ప్రభుత్వం ఇకపై రాష్ట్రంలో బెన్ ఫిట్ షోలు, టికెట్ల పెంపు నిర్ణయం ఉండదని ప్రకటించింది.

-------------------------

హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణాలో అమలు చేస్తున్న మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో విజయవంతంగా ఈ పథకం అమలు చేస్తున్నారంటూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాకారుల కోసం ఇటీవల తీసుకొచ్చిన కొత్త పాలసీ గురించి రాంప్రసాద్‌రెడ్డి వివరించారు.

-------------------------

వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. గుంటూరు జిల్లా, మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిన్న ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, బీసీల సంక్షేమం కోసం 39 వేల 7 కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. నామినేటెడ్ పదవుల కేటాయింపులో 34 శాతం బీసీలకు ఇవ్వాలనే అంశంపై చర్చలు జరుగుతున్నాయని మంత్రి తెలుపుతూ,

వాయిస్.. (33 సెకన్లు)

---------------------------

హరిత ఇంధనానికి ప్రాధాన్యత పెరుగుతున్న దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానాన్ని ప్రతిపాదించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, 2030 నాటికి స్వచ్ఛమైన, స్థిరమైన 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ గరిష్ఠ విద్యుత్ వినియోగం పెరుగుతుందని, తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ – 2024పై వచ్చే నెల 3న హైదరాబాద్‌లో వాటాదారుల సమావేశం నిర్వహిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

---------------------------

స్వాతంత్ర్య సమరయోధుడు ఉద్దమ్ సింగ్ జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. 1899 డిసెంబర్ 26న పంజాబ్లో జన్మించిన ఉద్దమ్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం విశేషంగా కృషి చేశారు. జలియన్ వాలా భాగ్ దురంతానికి కారణమైన ఆంగ్ల అధికారి జనరల్ డయ్యర్‌పై గుళ్ళవర్షం కురిపించి ప్రతీకారం తీర్చుకున్న స్వాతంత్ర్య సమరయోధుడు ఉద్దమ్ సింగ్ త్యాగానికి, దేశభక్తికీ ప్రతీక. ఉద్దమ్ సింగ్ జయంతి సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు.

---------------------------

కొత్త తరహాలో చేస్తున్న సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ–టీజీఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ సూచించారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన మాట్లాడుతూ, మీ పిల్లలు రహదారి ప్రమాదానికి గురయ్యారని, ఆసుపత్రిలో ఉన్నారంటూ తక్షణమే నగదు పంపాలని మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇటువంటి మోసపూరిత ఫోన్‌లు వస్తే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

---------------------------

పాడిరైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లాలోని చాట్రాయిలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన గోకులం గోశాలను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పశు పోషణకు మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మినీ గోకులం షెడ్లను మంజూరు చేస్తోందని చెప్పారు. ఈ పథకం కింద ప్రభుత్వం 90 శాతం రాయితీ అందిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని విజయవాడ పశ్చిమ శాసన సభ్యులు వై.సుజనా చౌదరి అన్నారు. విజయవాడ నగరంలోని రామ్మోహన్ గ్రంథాలయంలో వాజ్‌పేయీ విజ్ఞాన కేంద్రాన్ని అవనిగడ్డ శాసనసభ సభ్యులు మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజనాచౌదరి మాట్లాడుతూ, 117 ఏళ్ల చరిత్ర కలిగిన గ్రంథాలయానికి పూర్వవైభవం తేవడం గొప్ప విషయమన్నారు. ఈ గ్రంథాలయాన్ని మరింత మంది వినియోగించుకునేందుకు విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు.

=====================